వసతులు లేక అవస్థలు

- జగనన్న కాలనీలపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు
- పేదల ఇళ్ల వద్ద కనీస సౌకర్యాలు కరువు
- రోడ్లు, డ్రైయినేజీలు, తాగునీరులేక అవస్థలు

ఉరవకొండ: పేదలందరికీ పక్కా ఇల్లు నిర్మించాలన్న ఉన్నత లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న కాలనీలను నిర్మించింది. అర్హులందరికీ పట్టాలు అందించి ఇల్లు కట్టుకునే వెసులుబాటు కల్పించింది. దీంతో ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకొని అందులో నివసిస్తున్నారు. అయితే ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం గత పాలకులు చేపట్టిన పనులపై వివక్ష చూపుతోంది. కాలనీల్లో కనీస సౌకర్యాలు కల్పనకు చర్యలు తీసుకోలేదు. దీంతో పేదలు అవస్థలు పడుతున్నారు. జిల్లాలోనే రికార్డు స్థాయిలో ఉరవకొండలో కొలిమి లేవుట్, రాయంపల్లి లేవుట్ కాలనీల్లో 3 వేల ఇళ్ల నిర్మాణం సాగింది. 80 శాతం మంది వైఎస్సార్‌సీపీ హయాంలో ఇళ్లు నిర్మించుకుంటే మరికొందరు ఇంటి నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. కానీ ప్రస్తుతం పరిస్థితులు తలకిందులైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జగనన్న కాలనీలను పట్టించుకోకపోవడంతో లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు.



కాలనీలో ఏపుగా పెరిగిన ముళ్ల కంపలు

మౌలిక వసతులు లేక తీవ్ర అవస్థలు:
ఉరవకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 12 లేవుట్‌లు ఏర్పాటు అయ్యాయి. 8,651 మంది అర్హులను ఇంటి పట్టాలు అందించి, 26 వేల మందికి పక్కా ఇళ్లు మంజూరు చేశారు. ఇందులో 13 వేల ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లు నిర్మించుకోమని అధికారులు వెంటబడుతున్నారే తప్ప కాలనీల్లో మౌలిక వసతులు కల్పించలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



విద్యుత్ స్తంభాలకు వీధి లైట్లు ఏర్పాటు చేయకుండా వదిలేసిన దృశ్యం

తాగునీరు, రోడ్లు లేక నరకయాతన
ఉరవకొండ పట్టణంలోని కొలిమి, రాయంలిపల్లి లేఅవుట్‌లతో పాటు అన్ని మండలాల్లోని లేఅవుట్‌ల్లో కనీస వసతులు కల్పించలేదు. చిన్న పాటి వర్షం వస్తే మోకాలు లోతు నీరు ఇళ్ల ముందు నిలిచిపోతుంది. పలు కాలనీల్లో వీధి దీపాలు లేక చీకట్లో మగ్గుతున్నాయి. ఉరవకొండలోని లేఅవుట్ కాలనీల్లో బోర్లు పనిచేయకపోవడంతో కిలోమీటర్లు దూరం వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. కాలనీల మధ్య ముళ్ల కంపలు ఏపుగా పెరిగాయి. విషపురుగులు ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

వసతుల కోసం నివేదికలు పంపాం

ఇంటి నిర్మాణాలు పూర్తి అయిన కాలనీల్లో మౌలిక వసతులు కల్పించడానికి ప్రభుత్వానికి నివేదికలు పంపాం. రోడ్లు, డ్రెయినేజీలతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకుంటాం. దీనికి సంబంధించిన నిధులు ప్రభుత్వం విడుదల చేయగానే పనులు త్వరిత గతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

– హనుమప్ప, ఇన్‌చార్జ్ డీఈఈ, గృహ నిర్మాణశాఖ, ఉరవకొండ

చీకట్లో మగ్గుతున్నాం



రెండు నెలల నుంచి వీధి దీపాలు ఏర్పాటు చేయలేదు. చీకట్లో మగ్గుతున్నాం. కాలనీల్లోకి ఎవరు వచ్చి వెళ్తున్నారో తెలియడంలేదు. ఉరవకొండలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. కాలనీలో బిక్కు బిక్కు మంటూ కాలం వెల్లదీస్తున్నాం.

– గోవిందు, కొలిమి లేవుట్, ఉరవకొండ

రోడ్లు నిర్మించలేదు



కాలనీలో రోడ్లు లేవు. చిన్నపాటి వర్షం వస్తే ఇంటి ముందు మోకాలు లోతు నీరు నిలుస్తోంది. వీధిలోకి వెళ్లే అవకాశం లేకపోతోంది. నీరు నిలిచి అపరిశుభ్రతతో దుర్వాసన వస్తోంది. అధికారులు రోడ్లు వేయాలి.

– షమీం, జగనన్న కాలనీ, ఉరవకొండ

తాగునీరు లేక అవస్థలు



కొలిమి లేఅవుట్ కాలనీలో మూడు బోర్లు ఉన్నా ఒక్కటీ పని చేయడం లేదు. తాగడానికి, ఇంటి అవవరాల కోసం నీటిని ట్యాంకు రూ.500 పెట్టి కొంటున్నాం. ఫిల్టర్ నీరు బిందె రూ.8 నుంచి రూ.10 వరకు పెట్టి కొంటున్నాం.

– జయశ్రీ, జగనన్న కాలనీ, ఉరవకొండ

ముళ్ల కంపలు పెరిగాయి



కాలనీలో ముళ్ల కంపలు పెరిగి నడవడానికి వీలు లేకుండా ఉంది. విష పురుగులు ఇళ్లలోకి వస్తున్నాయి. అధికారులు ముళ్ల కంపలను తొలగించాలి.

– లక్ష్మి, జగనన్న కాలనీ, ఉరవకొండ

క్లుప్తంగా

విద్యారంగాన్ని కాపాడుకోవమే లక్ష్యం



రాయదుర్గంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు

రాయదుర్గంటౌన్: విద్యారంగాన్ని కాపాడుకోవడమే యూటీఎఫ్ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీరాజా, కోటేశ్వరప్ప తెలిపారు. జనవరి 5 నుంచి 8 వరకు కాకినాడలో జరిగే యూటీఎఫ్ రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలను పురస్కరించుకుని చేపట్టిన ప్రచార జాతా గురువారం రాయదుర్గం పట్టణానికి చేరుకుంది. యూటీఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులకు స్థానిక యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పట్టణంలో బైక్ ర్యాలీ చేశారు. అక్కడ ప్రచార జాతలో హాజరైన రాష్ట్ర కార్యదర్శులు మాట్లాడారు. రాష్ట్రంలోని నలుమూలల నుంచి కాకినాడలో జరిగే సభలకు ఉపాధ్యాయులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి లింగమయ్య, కౌన్సిల్ సభ్యుడు వెంకటరామిరెడ్డి, జిల్లా కార్యదర్శులు హనుమంతరెడ్డి, రవి కుమార్, మండలాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

కోనాపురంలో ఫ్యామిలీ ఫిజిషియన్



ఫ్యామిలీ ఫిజీషన్ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ రాజేష్ కుమార్,సిబ్బంది

బ్రహ్మసముద్రం : మండలంలోని కోనాపురంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. గ్రామంలో నడవలేని స్థితిలో ఉండి మంచానికే పరిమితమైన వృద్ధులు, దివ్యాంగులను ఇంటి వద్దకే వెళ్లి వైద్యాధికారి పరీక్షించారు. వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుకున్నారు. అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఎచ్ పీ సల్మా , హెల్త్ అసిస్టెంట్ గోవిందరాజులు, ఏఎస్ ఎం నిర్మల, ఆశా వర్కర్లు గీతాంజలి, తిప్పక్క తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నగర సంకీర్తన



కోలాహలంగా సాగిన అయ్యప్పమాలధారుల నగర సంకీర్తన

రాయదుర్గంటౌన్: పట్టణంలోని శాంతినగర్‌లో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో మండల పూజ, నగర సంకీర్తన కార్యక్రమాలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్పస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో స్వామి విగ్రహానికి ప్రత్యేక పూల అలంకరణలో వాహనంపై కొలువు దీర్చి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. నగరసంకీర్తనలో మహిళల కలశ ప్రదర్శన, బాలికల కోలాట నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

అందరికీ ఆరోగ్యపరీక్షలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యులు రమేష్

గుమ్మఘట్ట : ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయాలని పీహెచ్‌సీ వైద్యులు రమేష్ తెలిపారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఏఎన్‌ఎం,ఎంఎల్‌హెచ్‌పీలకు నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు.18ఏళ్ల పైబడిన వారికి ముందస్తుగా కేన్సర్, బీపీ, షుగర్ పరీక్షలు చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు బాలాజీనాయక్, సీహెచ్‌ఓ మురళీధర్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనానికి నిప్పు



కాలిపోయిన ద్విచక్ర వాహనం

బొమ్మనహాళ్: మండలంలోని చంద్రగిరి గ్రామంలో బొలప్పగారి చంద్ర అనే వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనానికి దుండగులు బుధవారం అర్ధరాత్రి నిప్పుపెట్టారు. ఇంటి ముందు నిలిపి ఉంచిన బైక్‌కు నిప్పు పెట్టారు. దీంతో పూర్తిగా కాలిపోయింది. మంటలు ఎక్కువగా రావడంతో పొరుగింట వారు చంద్రను నిద్రలేపారు. అయితే అప్పటి వాహనం పూర్తిగా కాలిపోయింది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అగ్రికల్చర్ ఫాంలో ప్రయోగాలు



వరిదిగుబడిని పరిశీలిస్తున్న డీడీఏ మద్దిలేటి

కణేకల్లు: కణేకల్లు అగ్రికల్చర్ ఫాంలో సాగు చేసిన వరి పంట దిగుబడులపై అధికారులు పంటకోత ప్రయోగాలు చేశారు. ఎస్ఎస్ఎంఎఫ్ (స్టేట్ సీడ్ మల్టిఫికేషన్ ఫాం) 72.50 ఎకరాల్లో వరి సాగు చేయగా పీడీడీఎఫ్ (ప్రాజెక్ట్ డెమోన్‌స్ట్రేషన్ అండ్ డెవలప్‌మెంట్) ఫాంలో 67.50 ఎకరాల్లో వరి సాగు చేశారు. పంట కోతకు ముందు ఈ రెండు ఫారాల్లో అధికారులు నిబంధనల మేరకు రైతుశిక్షణ కేంద్రం డీడీఏ మద్దిలేటి ఆధ్వర్యంలో పంటకోత దిగుబడులపై ప్రయోగాలు నిర్వహించారు. ఏడీఏ నారాయణనాయక్, ఏఈఓ మణికంఠలు 5×5 మీటర్ల విస్తీర్ణంలో వరి కంకిలను కోసి ప్రయోగాలు నిర్వహించారు. ఎస్ఎస్ఎంఎఫ్‌లో హెక్టారుకు 83.48 క్వింటాలు, పీడీడీఎఫ్‌లో 52.06 క్వింటాలు దిగుబడి రానున్నట్లు అధికారులు అంచనా వేశారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు

బెళుగుప్ప: మండలంలోని నరసాపురం వద్ద గురువారం రాత్రి ద్విచక్ర వాహనం, లారీ ఢీకొన్న ప్రమాదంలో దుర్గేష్ (28), భారతి(24) దంపతులకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు.. ఒంటిమిద్దికి చెందిన దుర్గేష్ అత్తగారి ఊరు అయిన బెళుగుప్ప మండలం నరసాపురానికి భార్యతో కలిసి వెళ్తుండగా జాతీయ రహదారిపై లారీ ఢీకొనింది. గాయపడిన వీరిని 108 వాహనంలో కళ్యాణదుర్గం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్త సమాచారం

ఉపాధి హామీ పనులపై సమీక్ష
బ్రహ్మసముద్రం : మండలంలో ఉపాధి హామీ పనులను వేగవంతంగా చేపట్టాలని ఏపీడీ రమేష్ నాయక్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశమయ్యారు. మండలంలో చేపట్టిన ఉపాధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లు అవినాష్, మంజునాథ, బీఎఫ్‌టీ వన్నూరుస్వామి, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యం
కుందుర్పి: మండలంలోని ఎనుములదొడ్డికి చెందిన స్వర్గీయ మాజీ వైస్ ఎంపీపీ బీజప్ప కుమారుడు ప్రసాద్, చైతన్య వివాహ వేడుక కర్ణాటక తిప్పరెడ్డిపల్లిలో గురువారం జరిగింది. మాజీ ఎంపీ తలారి రంగయ్య, సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉమామహేశ్వర్‌నాయుడు తదితరులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. శెట్టూరు జెడ్పీటీసీ మంజునాథ్, వైస్ ఎంపీపీ భీమిరెడ్డి, సర్పంచులు విజయ్, అతావుల్లా, బొమ్మయ్య, ఎంపీటీసీ ఓనాథ్, విజయ్, నాయకులు బొమ్మలింగ, తిప్పేస్వామి, నరసింహులు, మాజీ వైస్ సర్పంచ్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

శెట్టూరు: మండల సరిహద్దు ప్రాంతమైన తిప్పారెడ్డిపల్లిలో జరిగిన వివాహ వేడుకకు మాజీ ఎంపీ తలారి రంగయ్య, నాయకులు ఉమామహేశ్వర నాయుడు హాజరయ్యారు. కుందుర్పి మండలం ఎనుములదొడ్డికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.జి . సోమనాథ్ కుమారుడు కుమాడు ప్రసాద్ వివాహ వేడుకకు హాజరయ్యారు. జెడ్పీటీసీ మంజునాథ, నాయకులు ఎమ్మెస్ రాయుడు, తిప్పేస్వామి, విజయ్, బొమ్మలింగ, తిప్పేస్వామి, అతాహుల్ల తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన తప్పక పాటించాలి
వజ్రకరూరు: అంగన్‌వాడీ కార్యకర్తలు,ఆయాలు సమయపాలన తప్పక పాటించాలని ఐసీడీఎస్ సూ`పర్ వైజర్ హెచ్.పద్మా సూచించారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో గడేహోతూరు,రాగులపాడు సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సెక్టార్ల వారీగా రికార్డులు పరిశీలించారు.

ఆర్థిక సాయం
కుందుర్పి: మలయనూరు గ్రామ గ్రేస్ చర్చి పాస్టర్ విజయ్‌కుమార్ అదే గ్రామానికి చెందిన చించనా అనే బాలిక వైద్యం ఖర్చులకు రూ.15 వేలు గురువారం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నరశింహమూర్తి, మహేష్, ఓబుళరాజు, లక్ష్మన్న పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ శత వార్షికోత్సవం
రాయదుర్గంటౌన్: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) వందేళ్ల వార్షికోత్సవాన్ని గురువారం సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక మొలకాల్మూరు రోడ్డులో పార్టీ జెండాను సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సంజీవప్ప, నియోజకవర్గ కార్యదర్శి నాగార్జున ఆవిష్కరించి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కొట్రేష్, తిప్పేస్వామి, నరసింహులు, దుర్గన్న, అంజి, నాగరాజు, పార్వతి, హనుమంతు, నాగిరెడ్డి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతరం పోరాటం
కూడేరు: ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కేశవ రెడ్డి, మండల కార్యదర్శి నారాయణమ్మ పేర్కొన్నారు. గురువారం కూడేరులో సీపీఐ వందేళ్ల వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కేశవరెడ్డి పార్టీ జండాని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పెరుగు సంగప్ప, రమణ, మలరాయుడు, ఖాసీంపీరా, ధనరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

28, 29 తేదీల్లో తాగునీటి సరఫరా బంద్
రాయదుర్గంటౌన్: హెచ్చెల్సీ తాగునీటి సరఫరా పంపింగ్ పైప్‌లైన్ టీ.వీరాపురం వద్ద లీకేజీ మరమ్మతుల కారణంగా 28, 29 తేదీల్లో తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
రాయదుర్గంటౌన్: మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీపీఎం సీనియర్ నాయకుడు నాగరాజు, కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డికి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పారిశుధ్య విభాగం నాయకులు రాము, మల్లేష్, సిద్దలింగ, ఎర్రిస్వామి, ఇంజనీరింగ్ విభాగం కార్మిక నాయకులు తిప్పేరుద్ర, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా పల్లకీ ఉత్సవం
వజ్రకరూరు: స్థానిక షిరిడి సాయి ఆలయంలో గురువారం సాయంత్రం పల్లకీ ఉత్సవం కనులపండువగా జరిగింది. ఆలయంలో స్వామికి అభిషేకాలు, తీర్థప్రసాదాలు వినియోగం చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

పోటా పోటీగా భజన పోటీలు
బెళుగుప్ప: విరుపాపల్లిలో సద్గురు నారాయణార్యారూఢస్వామి రథోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం రాత్రి నిర్వహించిన భజన పోటీలు ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రథమ, ద్వితీయ,తృతీయ, నాల్గో బహుమతులు అందించారు.

రెవెన్యూ సదస్సులో ఆరు వినతులు
గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెర గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో ఆరు వినతులు అందినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. సర్వే కోసం 4, పట్టాదారు పాసుపుస్తకాల కోసం 2 వినతులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, డీటీ రఘు, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయాలి
కళ్యాణదుర్గం రూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ తెలిపారు. గురువారం పట్టణంలోని మున్సిపాల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకులు ధర్నా చేశారు.

తీర్మానం లేకుండానే పనులు ఎలా చేస్తారు?



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామచంద్ర

కంబదూరు: గ్రామ సభ తీర్మానం లేకుండానే కూటమి నాయకులు పల్లె పండుగ కింద మంజూరైన నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువ పనులు, గోకులం షెడ్ల నిర్మాణాలను ఎలా చేస్తారని సర్పంచులు అధికారులను నిలదీశారు. గురువారం గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లక్ష్మీదేవమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.సర్పంచ్‌లు,ఎంపీటీసీలు ప్రజా సమస్యలపై అధికారులను నిలదీశారు. మండలంలో ఎక్కువ శాతం ఇన్‌చార్జ్ అధికారులు ఉండటంతో పాలన అస్తవ్యస్తంగా మారిందన్నారు. కురాకులపల్లిలో ప్రభుత్వ పాఠశాల పక్కనే బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న పట్టించుకునే వారే లేరని సర్పంచ్ చంద్రశేఖర్ సభ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలపై ట్రాన్స్‌కో అధికారులు స్పందించలేదని ట్రాన్స్‌కో ఏఈ గంగాధర్‌ను పాళ్లూరు సర్పంచ్ లక్ష్మీదేవమ్మ నిలదీశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామచంద్ర, ఏఓ తిప్పయ్య, ఈఓపీఆర్డీ గూడెన్న, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు,అధికారులు పాల్గొన్నారు.

జనవరి ఆఖరులోపు రోడ్డు నిర్మాణాలు పూర్తి

- పంచాయతీరాజ్ శాఖ డీఈఈ మహమ్మద్ రసూల్



పందికుంటలో సీసీ రోడ్డు నిర్మాన పనులను పరిశీలిస్తున్న పీఆర్ డీఈఈ మహమ్మద్ రసూల్

వజ్రకరూరు: జనవరి ఆఖరులోపు సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నియోజకవర్గ పంచాయతీరాజ్ డీఈఈ మహమ్మద్ రసూల్ తెలిపారు. గురువారం మండలంలోని పందికుంట గ్రామంలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను డీఈఈ పరిశీలించారు. నిర్మాణ అనంతరం కొనకొండ్లలో సీసీ రోడ్లను కూడా డీఈఈ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో 2024–25 సంవత్సరానికి సంబంధించి ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా 64 సీసీ రోడ్లు మంజూరయినట్లు తెలిపారు. వీటికి రూ.2.60 కోట్లు మంజూరయ్యిందన్నారు. ఇప్పటి వరకు 48 సీసీ రోడ్ల పనులు ప్రారంభమయ్యాయన్నారు. ఇన్‌చార్జ్ ఏఈ లక్ష్మీనారాయణ, టెక్నికల్ అసిస్టెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

20 వాహనాలకు జరిమానా

వజ్రకరూరు: మండల కేంద్రంలో గురువారం సాయంత్రం ఉరవకొండ–గుంతకల్లు ప్రధాన రహదారిలో ఎస్ఐ నాగస్వామి ఆధ్వర్యంలో 20 మంది వాహనదారులకు జరిమానా వేశారు.

ఆరు నెలల పాలనతోనే విసిగిపోయారు

- కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య

శెట్టూరు: కూటమి ప్రభుత్వ ఆరు నెలల పాలనతోనే ప్రజలు విసిగి పోయారని మాజీ ఎంపీ తలారి రంగయ్య, నాయకులు ఉమామహేశ్వర నాయుడు అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు పేదలకు భారమయ్యాయన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకపోగా ప్రజలపై విద్యుత్ చార్జీల పేరిట రూ. 1,500 కోట్ల భారం మోపడానికి సిద్ధపడ్డారన్నారు. కూటమి ప్రభుత్వంతో ప్రజలు ఆరునెలలకే అలసిపోయారన్నారు.

ప్రజల పక్షాన పోరాటం...
వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన పోరాడుతుందని, పేద, మధ్య తరగతి ప్రజలు విద్యుత్ చార్జీలు భరించలేక పోతున్నారని, ప్రభుత్వ నిర్ణయంపై నిరసనగా కళ్యాణదుర్గంలో శుక్రవారం పోరుబాట చేపడుతున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అనంతరం అధికారులకు వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ మంజునాథ, మాజీ మండల కన్వీనర్ సోమనాథరెడ్డి, నాయకులు ఎమ్మెస్ రాయుడు, శెట్టూరు తిప్పేస్వామి, మహాబలి, వీరాంజనేయులు, రామాంజనేయులు, లింగప్ప, రాజశేఖర్ రెడ్డి, టైలర్ వన్నూరుస్వామి, తగిల్ బాష, గోపి, హాసిం, కిష్టప్ప, వన్నూరప్ప, జికల నాగరాజు, శ్రీనప్ప, మల్లి, పాతలింగ, తాలారి సత్తి పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న తలారి రంగయ్య



విలేకర్లతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేద్దాం
కళ్యాణదుర్గం రూరల్: క్షేత్రస్థాయిలో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయాలని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య సూచించారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు బోయ తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమామహేశ్వరనాయుడు పాల్గొన్నారు. అనంతరం కార్యక్రమంలో కళ్యాణదుర్గం మండల కన్వీనర్‌ను ఎన్నుకోవడానికి అభిప్రాయాలు సేకరించారు. నాయకులంతా గోళ్ల సూరిని ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు ఆసక్తికనబరిచారు.

పోరుబాటను విజయవంతం చేయండి..
కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి విద్యుత్ చార్జీలు పెంచడం దారుణమని మాజీ ఎంపీ తలారి రంగయ్య పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీ ఉంటుందన్నారు. జెడ్పీటీసీ బొమ్మన్న, మండల కన్వీనర్ సర్వోత్తం, మండల జేసీఎస్ కన్వీనర్ ఆంజనేయులు, సర్పంచులు హనుమంతు, చంద్రనాయక్, నాయకులు నారాయణపురం వెంకటేశులు, కొత్తూరు బాబు, గోళ్ల సూరి, మల్లాపురం మల్లి, బోరంపల్లి రామిరెడ్డి, కిరీటి, ఎర్రంపల్లి కృష్ణమూర్తి, దొడగట్ట సూరి, టైలర్ శీన తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి: కళ్యాణదుర్గంలో పార్టీ సమన్వయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీల పెరుగుదను నిరసిస్తూ శుక్రవారం చేపట్టిన పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పాలాక్షి, ఎంపీపీ కమలమ్మ, మలయనూరు మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి తదితరులు సూచించారు. గురువారం కెంచంపల్లిలోని పాలాక్షి స్వగృహంలో మండల నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో ఎస్సీసెల్ డివిజన్ అధ్యక్షుడు తిప్పేస్వామి, ఐటీ విభాగం తాలూకా అధ్యక్షుడు మరిస్వామి, కుందుర్పి ఎంపీటీసీ హనుమంతరాయుడు, అంజి, రాజు తదితరులు ఉన్నారు.

బెళుగుప్ప: ప్రస్తుత కూటమి ప్రభుత్వం కరెంటు చార్జీల బాదుడిపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఉరవకొండలో శుక్రవారం చేపట్టే పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం అని మండల కన్వీనర్ చిన్న మచ్చన్న గురువారం ఓ ప్రకటనలో కోరారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

పోరుబాటను జయప్రదం చేయండి

- సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపు



ఉరవకొండ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని మోపడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు ఉరవకొండలో శుక్రవారం జరగనున్న పోరుబాటను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే విశ్వ మాట్లాడుతూ ఉరవకొండలోని ఉరగాద్రి కళ్యాణ మండపం నుంచి ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ర్యాలీలో ఐదు మండలాల ఎంపీపీ, జెడ్పీటీసీలు, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యులతో పాటు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొనేందుకు తరలిరావాలన్నారు. ఉరగాద్రి కళ్యాణ మంటపం నుంచి విద్యుత్ శాఖ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేసి, అనంతరం అధికారులకు వినతి పత్రం అందిస్తామన్నారు. ర్యాలీలో రైతులు, ప్రజానీకం స్వచ్ఛందంగా పాల్గొని కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలపై నిరసన తెలపాలని పిలుపునిచ్చారు.

విద్యుత్ చార్జీలు పెంచి సంపద సృష్టిస్తారా?



రాయదుర్గం: కూటమి ప్రభుత్వం అధికారంలో కొచ్చి ఏడు నెలలు గడవక ముందే సీఎం చంద్రబాబు రూ.15 వేల కోట్లు విద్యుత్ చార్జీలు పెంచి సామాన్యుల నడ్డి విరిచారని రాయదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని తన నివాసంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం కరెంటు చార్జీలు పెంచడాన్ని నిరసిస్తూ తలపెట్టిన 'వైఎస్సార్‌సీపీ పోరుబాటు'ను విజయవంతం చేసేలా పార్టీ నాయకులు, కార్యకర్త లకు దిశానిర్దేశం చేశారు. రాయదుర్గం, గుమ్మఘట్ట, డి హీరేహాళ్, బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల నుంచి తరలివచ్చే రైతులు, పార్టీ నాయకులు ఉదయం 10 గంటల్లోగా స్థానిక వినాయసర్కిల్ వద్దకు చేరుకోవాలని సూచించారు. అక్కడి నుండి బారీ ర్యాలీతో లక్ష్మీబజార్ మీదుగా కణేకల్లు రోడ్డులోని విద్యుత్‌శాఖ ఏడీ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన తెలియజేస్తామన్నారు. అనంతరం వినతిపత్రం అందజేస్తున్నట్టు తెలిపారు.

డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితాలు బుగ్గి

ఉరవకొండ: విద్యార్థిని, విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ జనార్ధన్‌నాయుడు పిలుపు నిచ్చారు. గురువారం స్థానిక ప్రభుత్వ జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో డ్రగ్స్, ర్యాగింగ్, ఈవ్‌టీచింగ్‌లపై పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజేశ్వరీ, ఉపాధ్యాయులు హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి మండల పూజ

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం అయ్యప్పస్వామి మండలపూజ నిర్వహించారు. ఉదయం నుంచి అయ్యప్పమాల ధరించిన భక్తులు ఉపవాసంతో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీలో పట్టణంలో ఊరేగించారు. మహిళ భక్తులు జ్యోతులు పట్టారు. భక్తులకు ఆలయం కమిటీ సభ్యులు ఉచిత అన్నదానం నిర్వహించారు.

సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో ఫాతెహాలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారి సమాధి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో గురువారం భక్తులు దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. గురువారం స్వామివారం కావడంతో భక్తులు స్వామి దర్శనార్థం ఆంధ్రా,కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు.